క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వంగర: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వేమిరెడ్డి సాంబశివరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. సీతాదేవిపురం 11 కేవీ ఫీడర్ లైన్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాతమరువాడ, కొత్తమరువాడ, సీతాదేవిపురం గ్రామాలకు ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

బొబ్బిలి: విద్యుత్ మరమ్మతుల నిర్వహణ పనుల నేపథ్యంలో పాతబొబ్బిలి ఫీడర్ పరిధిలోని గొల్లవీధి, సింగారపువీధి, ఫూల్‌భాగ్ ప్రాంతాలతో పాటు కలువరాయి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దుస్తుల వితరణ



రేగిడి: పేదలకు వస్త్రదానం చేస్తున్న దాత జగన్నాథస్వామి

సంతకవిటి: మండలంలోని చింతలపేటలో పలువురు నిరుపేదలకు రిటైర్డ్ హెచ్‌ఎం పాట్నూరు మొయ్యన్నాయుడు గురువారం దుస్తులు వితరణ చేశారు. ఆయన తన తండ్రి పాట్నూరు వెంకునాయుడు జ్ఞాపకార్థం లుంగీలు, పంచెలు దానం చేసినట్లు తెలిపారు.

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన చిరువ్యాపారి వారణాశి జగన్నాథస్వామి.. పలువురికి వస్త్రదానం చేశారు. ఇదే మండలంలో తాటిపాడు, వావిలవలస, లక్ష్మణవలస, లింగాలవలస గ్రామాల్లోని 200 మందికి పైగా పేదలకు బట్టలు పంచిపెట్టినట్లు ఆయన తెలిపారు.

ఇత్తడి పీఠం బహూకరణ



ఇత్తడి పీఠం అందిస్తున్న దాత భీమారావు

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయానికి రాజాంకు చెందిన వ్యాపారవేత్త పేర్ల భీమారావు, సునీత దంపతులు ఇత్తడి పీఠాన్ని గురువారం బహూకరించారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఈ వస్తువులను అందించామని దాతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజార్లు రేజేటి సత్తిబాబు, రేజేటి వంశీకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాలఅన్నమ్మ పేరంటాలు జాతర



బాలఅన్నమ్మ పేరంటాలు

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామంలో బాలఅన్నమ్మ పేరంటాలు జాతర శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం గోపూజ(108 ఆవులకు పూజ), ఆహారం అందివ్వడం, శనివారం సాయంత్రం సాయి నృత్య నికేతన్ వారిచే కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు, రేలారే రేలా కార్యక్రమం, అన్నమయ్య నృత్య ప్రదర్శన, ఆదివారం ఉదయం భగవద్గీత పారాయణం, సాయంత్రం సంగిడీల పోటీలు,రాత్రి బాలు రైడర్స్ క్లాసికల్ డ్యాన్స్ ప్రోగ్రాం, జబర్దస్త్ హంగామా, సోమవారం మధ్యాహ్నం అమ్మవారి పల్లకి ఊరేగింపు, కోలాటం, డప్పు వాయిద్యాలు, సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం అన్నప్రసాదం వితరణ ఉంటుందన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

రాజాం: క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా వైద్య శాఖ చర్యలు చేపడుతోందని క్షయవ్యాధి నివారణ విభాగం డివిజనల్ సూపర్‌వైజర్ లలిత తెలిపారు. స్థానిక పట్టణంలోని ఎస్సీ కాలనీ, కనకమహాలక్ష్మి నగర్ తదితర ప్రాంతాల్లో క్షయవ్యాధి నిర్మూలనపై గురువారం అవగాహన కల్పించడంతో పాటు ర్యాలీ నిర్వహించారు. రాజాం అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సిద్ధేశ్వరి మాట్లాడుతూ క్షయవ్యాధిని ఆరంభంలో పసిగడితే త్వరితగతిన నయం చేయడంతో పాటు సకాలంలో వ్యాధి నిర్మూలనకు కృషి చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సరోజిని, సీహెచ్‌వో ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

రైతన్నా.. జర భద్రం!

- కోల్డ్ స్టోరేజీల్లో పంట దాచితే మోసపోయే ప్రమాదం
- నాణ్యమైన సరుకును మార్చి నాసిరకం పెట్టే అవకాశం
- అగ్నిప్రమాదాలకు సైతం ఆస్కారం
- గొడౌన్ల యాజమాన్యం బాధ్యతలపై అనుమానాలు
- గతంలో ముచ్చర్లవలస కోల్డ్ స్టోరేజీలో పసుపు మాయం!



ముచ్చర్లవలసలోని ఓ కోల్డ్‌స్టోరేజ

రామభద్రపురం:

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను.. ఏ మాత్రం నష్టపోకుండా గిట్టుబాటు ధర ఉన్నప్పుడు మాత్రమే విక్రయించేందుకు వీలుగా కోల్డ్‌స్టోరేజీల్లో పంటను దాచి ఉంచుతారు. వ్యాపారులు సైతం రైతుల వద్ద కొనుగోలు చేసిన పంటను గిట్టుబాటు ధర వచ్చినప్పుడే అమ్మేందుకు కోల్డ్ స్టోరేజీల్లో పంటను నిల్వ ఉంచుతారు. అయితే ఆ కోల్డ్‌స్టోరేజీల్లోని పంటకు ఎంతమేర భద్రత ఉందనేది ప్రశ్నార్థకంగా మారింది. సరుకు(పంట) భద్రంగా ఉంటుందా లేదా..? ఎంతవరకు భద్రం అనే కోణాల్లో సందేహాలు తలెత్తుతున్నాయి. గొడౌన్ల(కోల్డ్ స్టోరేజ) యాజమాన్యం కూడా మంచిగా కాపలా ఉంటుందా లేదా అనే భయాందోళన నెలకొంది. గొడౌన్లలో అగ్నిమాపక భద్రతా నియమాలు ఏ మేర పాటిస్తున్నారనే అనుమానం కూడా వస్తోంది. ఈ నేపథ్యంలో కోల్డ్‌స్టోరేజీల్లో పంటను ఉంచితే మోసపోయే ప్రమాదం ఉందని పలువురు భావిస్తున్నారు. ఎందుకైనా మంచిది రైతన్నా జర జాగ్రత్త అని సలహా ఇస్తున్నారు.

కంచే చేను మేసినట్లు..

కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకునే నాణ్యమైన పంట, సరుకులకు బదులు నాసిరకం పంట, సరుకు మార్చివేసే అవకాశం లేకపోలేదన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కంచే చేను మేసినట్లు రైతులు, వ్యాపారులు దాచుకున్న పంటను వారికి తెలియకుండానే గొడౌన్ల నిర్వాహకులే అమ్మేసే అవకాశం ఉందని, గతంలో ముచ్చర్లవలసలోని ఓ కోల్డ్ స్టోరేజీలో కూడా అప్పట్లో నిల్వ ఉంచిన పసుపు పంట విషయంలో కూడా ఇలానే మోసం జరిగిందన్న విషయం జోరుగా ప్రచారంలో ఉంది.



గతంలో వ్యాపారి ఫిర్యాదు మేరకు లోడ్ చేస్తున్న పసుపును అడ్డుకుంటున్న పోలీసులు(ఫైల్)

అప్పట్లో ఏం జరిగిందంటే..

అప్పట్లో సాలూరుకు చెందిన ఓ వ్యాపారి పసుపు పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో గిట్టుబాటు ధర వచ్చేంతవరకు ముచ్చర్లవలసలోని ఓ కోల్డ్ స్టోరేజీలో పంటను నిల్వ చేసుకున్నారు. స్టోరేజీలో తమ సరుకు భద్రంగా ఉందన్న నమ్మకంతో ఎప్పటికప్పుడు అద్దె చెల్లిస్తున్నారు. ఆ వ్యాపారి కూడా తరచూ తన పంట భద్రతపై ఆరాతీస్తూ వచ్చారు. మీ సరుకు మా బాధ్యత అని స్టోరేజి యాజమాన్యం కూడా నమ్మబలికింది. ఓ గుర్తు తెలియని వ్యక్తి సదరు వ్యాపారికి ఫోన్ చేసి, కోల్డ్‌స్టోరేజీలో మీ సరుకు లేదని, ఉన్న కాస్త సరుకు కూడా సిబ్బంది ఢిల్లీకి పంపించేందుకు లారీకి లోడ్ చేస్తున్నారని చెప్పారు. హుటాహుటిన కోల్డ్‌స్టోరేజి వద్దకు చేరుకున్న జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగప్రవేశం చేసిన పోలీసులు అక్కడికి చేరుకుని కోల్డ్‌స్టోరేజి మేనేజర్‌ను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. అయితే ఆ కేసు విషయాలు బయటకు రానీయలేదని సమాచారం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

అన్నదాతలు, వ్యాపారులు తమ పంటను లేదా సరుకును భద్రపరుచుకునే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ముందుగా కోల్డ్ స్టోరేజి విశ్వసనీయతను తెలుసుకోవాలి. తర్వాత అగ్నిమాపక శాఖ అనుమతులు ఉన్నాయా.. లేదా.. భద్రతా చర్యలు ఏ విధంగా ఉన్నాయో చూసుకోవాలి.

ఎన్‌వోసీ తప్పనిసరి..

పరిశ్రమలు, గొడౌన్లు, సామిల్లులు, ఆస్పత్రులు తదితర వాటి నిర్వహణకు అగ్నిమాపక సిబ్బంది నుంచి ఎన్‌వోసీ(నో అబ్జక్షన్ సర్టిఫికెట్) తప్పనిసరి. ముందుగా తీసుకున్న సర్టిఫికెట్‌కు ఏటా రెన్యువల్ కూడా చేయాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధన లేవీ పట్టించుకోకుండా ముచ్చర్లవలస వద్ద పలు కోల్డ్‌స్టోరేజీలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

రైతులను మోసగిస్తే చర్యలు..

కొన్ని నెలల క్రితమే తాను ఇక్కడికి బదిలీపై వచ్చాను. గతంలో ఏం జరిగిందో నాకు తెలీదు. ఇప్పటి నుంచి ఎవరైనా రైతులను మోసం చేసే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు, వ్యాపారులు కూడా ఎప్పటికప్పుడు తమ సరుకు భద్రతపై చెక్ చేసుకుంటే మంచిది.

–వి.ప్రసాదరావు, ఎస్‌ఐ, రామభద్రపురం

జీవామృతం తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో జీవామృతం తయారీపై గురువారం అవగాహన కల్పించారు. ఎకరం పంటపొలానికి జీవామృతం పిచికారీ చేయాలంటే 5 కిలోల ఆవుపేడ, 5 లీటర్ల ఆవుమూత్రం, 200 గ్రాముల ఇంగువను ఐదు లీటర్లలో కలిపి ఓ తొట్టెలో నాలుగు రోజుల పాటు నిల్వ చేయాలి. ఉదయం, సాయంత్రం ఆ మిశ్రమాన్ని సవ్యదిశలో కలపాలి. ఇదే మిశ్రమానికి 150 గ్రాముల సున్నం, 200 గ్రాముల ఇంగువను ఓ రెండు లీటర్ల నీటిలో కలిపి బాగా మరగబెట్టి దానిలో ఓ ముద్ద ఇంగువ వేసి చక్కగా కలిపిన తర్వాత ఆ ద్రావణాన్ని ఆవుపేడ, మూత్రంలో కలపాలి. ఈ విధంగా తయారైన ద్రావణాన్ని ఓ గుడ్డలో వడకట్టి తర్వాత వచ్చిన ద్రావణానికి 200 లీటర్ల నీటిని కలిపి ఎకరం పొలానికి పిచికారీ చేయాలి. ఈ జీవామృతం పిచికారీ చేస్తే మొక్కజొన్న, కూరగాయ పంటలకు వచ్చే చీడపీడలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, గుండాల రవి, పాదిలాపు సురేష్, కూనుబిల్లి రమణ, రెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మండల విద్యాకమిటీ సమావేశం

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి విద్యాకమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు నూతన విద్యా విధానం ప్రకారం పంచాయతీల వారీగా ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు ఆవశ్యకతపై చర్చించారు. ప్రస్తుతమున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో డొంకినవలస, వీరసాగరం, ఆకులకట్ట, అల్లువానివలస పాఠశాలలు రద్దవ్వగా, మోడల్ పాఠశాలలుగా వాడాడ, రేజేరు, గొల్లాది, కోడూరు ప్రాథమిక పాఠశాలలను మార్చేందుకు డీఈవోకు సిఫార్సు చేసేందుకు కమిటీ సభ్యులు ప్రతిపాదించారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, ఎంఈవోలు లక్ష్మణదొర, రాజేశ్వరి, తహసీల్దారు సుధాకర్, ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



చర్చిస్తున్న మండల విద్యాకమిటీ సభ్యులు

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మొదిలి కన్నుమూత

విజయనగరం అర్బన్: ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, శ్రమ శక్తి రాష్ట్ర అవార్డు గ్రహీత మొదిలి శ్రీనివాసరావు (65) కన్ను మూశారు. విశాఖలోని ఆయన స్వగృహంలో నిద్రలోనే గురువారం ఉదయం మృతి చెందినట్లు కుమారుడు కౌశిక్ గుర్తించారు. వెంటనే శ్రీనివాసరావు భౌతికకాయాన్ని విజయనగరంలోని స్వగృహానికి తరలించారు. పెద్ద ఎత్తున కార్మికులు, అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు శ్రీనివాసరావు భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. భార్య కమలావతి, ఇద్దరు కుమార్తెలు ఇందిరసంయుక్త, నాగధ్మ నివేదిక, కుమారుడు కౌశిక్‌లను కలిగిన శ్రీనివాసరావు దివంగత కార్మిక నాయకుడు మొదిలి సత్యం కుమారుడు. మొదిలి సూర్యారావు సోదరుడు. తండ్రి, అన్నయ్య అడుగుజాడల్లో నడిచి కార్మిక వర్గానికి శ్రీనివాసరావు అత్యంత ఆప్తుడయ్యారు. 1983 ఎన్నికల్లో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పూసపాటి అశోక్ గజపతిరాజుపై పోటీ చేసిన చరిత్ర మొదిలి శ్రీనివాసరావుది. పలుముఠా కార్మిక సంఘాలకు అధ్యక్షుడిగా, జిల్లా తెలగ సంక్షేమ సంఘం నిర్మాణంలోనూ విస్తృతంగా పాల్గొని తన సహాయ సహకారాలు అందించారు. గతంలో ఆంధ్రభూమి దినపత్రికలో పనిచేసిన ఆయన ఐఎన్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందారు. కార్మికలోకం ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని పలువురు సంతాపం వెలిబుచ్చారు. ఆయన మృతికి కార్మిక నాయకులు, పత్రికాప్రతినిధులు పలువురు తీవ్ర సంతాపం తెలియజేశారు.



మొదిలి శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు

సజావుగా కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియ

విజయనగరం క్రైమ్: స్టైపెండరీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు పీఎంటి, పీఈటీ పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ గురువారం తెలిపారు. 11వ రోజు గురువారం నిర్వహించిన పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులకు గాను 415 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. వారిలో 314 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారని పేర్కొన్నారు. నియామక ప్రక్రియ సజావుగా జరిగే విధంగా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు ఎం.వీరకుమార్, యూనివర్స్, ఎస్.రాఘవులు పర్యవేక్షించారు.



హైజంప్ చేస్తున్న అభ్యర్థి



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు



అభ్యర్థుల ఛాతి కొలుస్తున్న పోలీస్ అధికారులు

దొంగతనంపై ఆరా

బొబ్బిలి: పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం దొంగతనం జరిగినట్లు నమోదైన కేసుపై పోలీసులు గురువారం దర్యాప్తు నిర్వహించారు. కోర్టు సూపరింటెండెంట్ సోమశేఖరరావు చేసిన ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించగా, ఏమీ పోలేదని తేలిందని డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు.

శ్రీకాంత్ నియామకం పట్ల హర్షం

బాడంగి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కుమారుడు శంబంగి శ్రీకాంత్‌ను నియమించడం పట్ల పార్టీ శ్రేణుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావులు శ్రీకాంత్‌కు అభినందనలు తెలిపారు. ఆయన సమక్షంలో పార్టీ మరింత బలోపేతమవుతోందని ఆకాంక్షించారు.

గర్భిణులకు వైద్య తనిఖీలు

రేగిడి: మండలంలోని బూరాడ, ఉనుకూరు, రేగిడి, సంకిలి ఐసీడీఎస్ సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు వైద్య తనిఖీలు గురువారం నిర్వహించారు. బూరాడ, రేగిడి పీహెచ్‌సీల వైద్యాధికారులు అసిరినాయుడు, సోహిణీరాఘవ్, ఎస్.చలమయ్యలు కేంద్రాలకు వచ్చిన గర్భిణులతో పాటు బాలింతలు, చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు, ఆరోగ్య సలహాలు, సూచనలు ఇచ్చారు.

మాజీ కౌన్సిలర్‌కు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

బొబ్బిలి: పట్టణంలోని రామరాజ్యం ఆస్పత్రి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్ సిద్ధాంతపు శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. ఆయన ఇదే పట్టణంలోని తన దుకాణం వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా, ఆయనకు ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు యువకులు ఢీకొన్నారు. దీంతో కిందపడిన ఆయన తలకు గాయమైంది. అప్రమత్తమైన స్థానికులు ఘటన స్థలంలో గాయపడిన శ్రీనివాసరావును చికిత్స నిమిత్తం సీహెచ్‌సీకి తరలించారు.

గోమాతా.. నమోస్తుతే

చీపురుపల్లి: గోమాతలను పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించినట్లేనని, అంతా మంచి జరుగుతుందని పట్టణానికి చెందిన దుర్గామల్లేశ్వర సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు ముల్లు రమణ చెప్పారు. ముక్కనుమను పురస్కరించుకుని ఆనవాయితీ ప్రకారం గురువారం ఆసంస్థ ఆధ్వర్యంలో గోమాతలకు లక్ష్మీ పూజ చేశారు. పిండి వంటలను గోమాతలకు నైవేద్యంగా పెట్టారు. కుమరాం సర్పంచ్ ముల్లు రమాదేవి, ముల్లు వెంకటలక్ష్మణనాయుడు పాల్గొన్నారు.

బొండపల్లి మండలంలో..

బొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ముక్కనుమ పండగను రైతులు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే పాడి పశువులకు ప్రత్యేక పూజలు చేసి, పిండి వంటలు నైవేద్యంగా పెట్టి హారతులు ఇచ్చారు. అలాగే సాయంత్రం గ్రామాల్లో ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



బొండపల్లి: కొవ్వాడపేటలో గోవుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

చెట్టు కాదు విద్యుత్‌స్తంభం



రామభద్రపురం మండలంలోని తారాపురం గ్రామదేవత ఆలయం ఎదురుగా జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్‌స్తంభాన్ని చూస్తే అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. విపరీతమైన పిచ్చిమొక్కలు, పనికిరానికి తీగమొక్కలు ఇలా స్తంభం మొత్తం అల్లుకుని ప్రమాదకరంగా కనిపిస్తోంది. విద్యుత్ ప్రమాదాలు, కరెంట్ సరఫరాలో అంతరాయానికి ఇలాంటివే కారణమవుతున్నా సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడాన్ని అందరూ విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–రామభద్రపురం

రవాణా చార్జీలు చెల్లించాలి



రైతులకు ధాన్యం రవాణా చార్జీలు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాట్నూరు శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. ఇదే విషయమై బొబ్బిలి పట్టణంలోని పీఏసీఎస్ కేంద్రానికి గురువారం వెళ్లి, అక్కడి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. 2020–21 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి, రైతులంతా తమ సొంత డబ్బులతో ఏర్పాటు చేసుకున్న ట్రాక్టర్లు, లారీల్లో రైస్‌మిల్లులకు ధాన్యం తరలించారని, ఇంతవరకు వారికి ఆ డబ్బులు చెల్లించలేదన్నారు. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ధాన్యం రవాణా చార్జీలను కార్యాలయాలకు చెల్లించినా రైతుల ఖాతాల్లో మాత్రం నగదు జమ చేయలేదన్నారు. ఇప్పటికైనా రైతులకు ఆ డబ్బులు ఇప్పించి, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

–బొబ్బిలి

ఫుట్‌పాత్‌లపై వ్యాపారం అదుర్స్..



సంక్రాంతి పండగ వేళ ఫుట్‌పాత్‌లపై బట్టల వ్యాపారం జోరందుకుంది. ఏటా పండగకు విజయనగరం జిల్లా కేంద్రం తర్వాత బొబ్బిలిలోనే అత్యధికంగా వస్త్ర వ్యాపారం జరిగేది. అయితే ప్రస్తుతం సంక్షేమ పథకాలేవీ అమలు కాకపోవడంతో నిరుపేద, మధ్యతరగతి ప్రజల చేతిలో చిల్లిగవ్వ లేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది షాపింగ్‌మాల్స్, వస్త్ర దుకాణాలకు వెళ్లే వారి సంఖ్య బాగా తగ్గింది. దీంతో ఫుట్‌పాత్‌లపై తక్కువ ధరకు లభ్యమయ్యే బట్టలపై జనం ఎగబడ్డారు. బొబ్బిలిలో ఎప్పుడూ లేనంతగా చిరువ్యాపారాలు వెలిశాయి. కాలేజీ రోడ్డు సహా బజార్ల దగ్గర చిన్నచిన్న టెంట్లు, టేబుళ్లు, మంచాలు వేసుకుని మరీ వస్త్ర వ్యాపారం కొనసాగించారు. మొత్తం రూ.50 లక్షల వరకు వ్యాపారం జరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

–బొబ్బిలి

ఈ కోటలు.. చారిత్రక ఆనవాళ్లు!



రాజులు తవ్వించిన నుయ్యి

చారిత్రక ఆనవాళ్లుగా మిగిలిని రేగిడి మండలంలోని ఉంగరాడమెట్ట, వావిలవలస గ్రామాల్లోని కోటలు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి. రాజులు పోయారు.. రాజ్యాలు పోయాయి.. రాచరికం పోయింది.. కానీ వాటి ఆనవాళ్లు మాత్రం అలానే ఉండిపోయాయి. బొబ్బిలి రాజులైన బుల్లిబాబు, మైనర్ రాజాలు వీటిని నిర్మించారు. ఒకప్పుడు ఓ వెలుగు.. వెలుగొందిన కోటలు.. ఇప్పుడు నిరాశ్రయంగా పడి ఉన్నాయి. అయితే సంక్రాంతి పండగ వేళ వీటిని చూసేందుకు సందర్శకులు ఆసక్తి కనబరిచారు. ఆనాటి చరిత్రను తెలుసుకుని సరికొత్త అనుభూతి, చారిత్రక జ్ఞానం పొందారు.

–రేగిడి



వావిలవలసలో రాజుల పాలనకు గుర్తుగా మిగిలిన కోట



ఉంగరాడమెట్ట వద్ద బుల్లిబాబు రాజు నివశించిన కోట ఇదే..